క్లుప్తంగా

గ్రంథాలయం ఆకస్మిక తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా ముఖ్య కార్యదర్శి రమ

ధర్మవరం: పట్టణంలోని శాఖా గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రంథాలయంలోని రికార్డులను పరిశీలించారు. గ్రంథాలయంలో సభ్యత్వాలతోపాటు పాఠకులను పెంచాలని సిబ్బందికి సూచించారు. గ్రంథాలయాధికారిణి అంజలి సౌభాగ్యవతి, సిబ్బంది సత్యనారాయణ, రమణ తదితరులు ఉన్నారు.

బస్సులు సకాలంలో నడపాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ డీఎం హరిత

కదిరి అర్బన్: విద్యార్థుల సౌకర్యార్థం గ్రామీణ ప్రాంతాలకు బస్సులు సకాలంలో నడపాలని గురువారం ఎస్ఎస్‌యూఐ నాయకులు డిపో ముందు ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ కదిరిలో చదువుకునే గ్రామీణ ప్రాంత విద్యార్థులు బస్సులు సకాలంలో రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కటారుపల్లికి బస్సు రావడం లేదన్నారు. అనంతరం అసిస్టెంట్ డీఎం హరిత సకాలంలో గ్రామీణప్రాంతాలకు బస్సులు నడుపుతామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. నాయకులు ఉపేంద్ర, శంకర్, హరి తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తాడిమర్రి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ స.సురేష్ బాబు గురువారం తెలిపారు. కళాశాలలో మ్యాథమేటిక్స్, జువాలజీ, బోటనీ, ఇంగ్లిష్ అధ్యాపక పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పోస్టు గ్యాడ్యుయేషన్ (పీజీ)లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులు అన్నారు. ఈనెల 7వ తేదీలోగా ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు మూడు సెట్లు జిరాక్స్ కాపీలతో ఇంటర్వ్యూలకు హాజరు హాజరు కావాలని ఆయన కోరారు.

రైతు సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా కాటమయ్య



బత్తలపల్లి: రైతు సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా కమతం కాటమయ్య ఎన్నికయ్యారు. గత నెల 29 నుంచి 31వ తేదీ వరకు మదనపల్లిలో రైతు సంఘం రాష్ట్రస్థాయి కౌన్సిల్ సమావేశాలు నిర్వహించారు. ఈసందర్భంగా కమతం కాటమయ్య, బెల్లం మహదేవ్‌ను రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికయ్యారు.

ప్రకృతి వ్యవసాయంతో ప్రజారోగ్యం



అప్పలవాండ్లపల్లిలో టమాట పంటను పరిశీలిస్తున్న అధికారులు

కొత్తచెరువు: ప్రకృతి వ్యవసాయం ద్వారా నేల, ప్రజారోగ్యాన్ని కాపాడొచ్చని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ సనావుల్లా పేర్కొన్నారు. మండలంలోని అప్పలవాండ్లపల్లిలో గురువారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన యువరైతు బాల చంద్రారెడ్డి ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన టమాట పంటను పరిశీలించారు. అలాగే రైతు సుబ్బిరెడ్డికి చెందిన పొలంలో ప్రకృతి వ్యవసాయం కింద పొడిభూమి విత్తుకోవడం(పీఎండీఎస్)ను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలు గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఓ విద్యావతి, అబ్దుల్ అలీ, నటరాజ్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాల కొనుగోలుకు టెండర్ల ఆహ్వానం

హిందూపురం టౌన్: స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రిలో సీసీ కెమెరాల కొనుగోలు, పాత సీసీ కెమెరాల మరమ్మతులకు కంపెనీల నుంచి సీల్డ్ టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రోహిల్ కుమార్ గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఆస్పత్రిలో మొత్తం 25 నూతన సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు, డీవీఆర్, వైరింగ్‌తో పాటు 10 పాత సీసీ టీవీ కెమెరాలకు మరమ్మతులు చేయాల్సి ఉంటుందన్నారు. ఈనెల 5వ తేదీలోపు టెండర్లను ఆస్పత్రి కార్యాలయంలో అందజేయాలన్నారు. అదే రోజు మధ్యాహ్నం 3:30 గంటలకు సూపరింటెండెంట్ చాంబర్‌లో తెరవడం జరుగుతుందన్నారు.

షెడ్లు వదిలారు.. రోడ్డున పడ్డారు!

- నిరుపయోగంగా షాపు రూములు
- బహిరంగంగానే వ్యాపారాల నిర్వహణ
- కూరగాయల మార్కెట్, సంత ఒకే చోట ఉండాలంటున్న జనం



కూరగాయల మార్కెట్ షెడ్లు

తలుపుల : అనువైన చోటు వదిలి అనువుగానిచోట కూరగాయల వ్యాపారం సాగుతోంది. భద్రత.. శుభ్రత ఉండేలా షెడ్లు ఏర్పాటు చేసినా నిరుపయోగంగా మారాయి. మండల కేంద్రం తలుపులలో ప్రతి శుక్రవారం వారపు సంత (కూరగాయలు తదితరాలు) జరుగుతోంది. మండలంలో దాదాపు 42వేల జనాభా ఉంది. కూరగాయలు, ఇతర నిత్యావసర సరుకుల కోసం తలుపులకు వచ్చి కొనుగోలు చేసి తీసుకెళ్తుంటారు. ఏళ్ల తరబడి ఎక్కడపడితే అక్కడ రోడ్లపైనే కూరగాయలు విక్రయించేవారు. దీంతో మెయిన్ రోడ్డు ఆక్రమణకు గురై ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుండేది. అధికారులు, రాజకీయ నాయకులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా స్థలాల్లో విక్రయాలు జరగకుండా ఖాళీ చేయించారు. సంత నిర్వహణకు ఒక నిర్దేశిత ప్రదేశం ఉండాలని గ్రామపంచాయతీ కార్యాలయం పక్కన విలువైన స్థలాన్ని ఎంపిక చేశారు. మూడేళ్ల క్రితం మండల పరిషత్ గ్రాంట్ కింద రూ.11 లక్షల అంచనా వ్యయంతో అన్ని వసతులతో కూడిన పది షెడ్లు నిర్మించారు. ఇందులో కూరగాయలు అమ్ముకునే వారికి నామమాత్రపు అద్దె నిర్ణయించి.. షెడ్డుకు రూ.20వేలు డిపాజిట్ చెల్లించేలా వేలం వేశారు. అయితే వేలం దక్కించుకున్న వారు షాపులు అరకొరగా నిర్వహించుకొంటూ, అద్దెలు సరిగా చేయడం చెల్లించడం లేదు. పూర్తిస్థాయిలో షెడ్లు వినియోగంలో లేకపోవడంతో బోసిపోయాయి. పాత పద్ధతి లోనే రోడ్ల పక్కన వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. దీంతో ట్రాఫిక్‌కు మళ్లీ ఇబ్బందులు మొదలయ్యాయి. పంచాయతీ అధికారులు స్పందించి కూరగాయలు/ సంత వ్యాపారాలు షెడ్లలోనే విధిగా నిర్వహించేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఒక చోట ఉంటేనే మేలు



వసతులు లేక ఇబ్బంది పడేవాళ్లను చూశాం. వసతులు ఉండి ఉపయోగించుకోకపోతే ఎలా? మార్కెట్ షెడ్లన్నీ వినియోగంలోకి వస్తే అక్కడక్కడా లేకుండా అన్ని సరుకులూ ఒకచోటే దొరుకుతాయి. ప్రజలకు ఇబ్బంది ఉండదు.

ఎస్.హైదర్‌వలి, ఎగువపేట, తలుపుల

వినియోగంలోకి తెస్తాం

కూరగాయల మార్కెట్‌లో పది షెడ్లు ఉన్నాయి. ఇందులో ఐదు మాత్రమే వినియోగించుకుంటున్నారు. మిగతా వాటిని వినియోగించుకోకుండా.. అద్దెలు కూడా చెల్లించడం లేదు. త్వరలో షెడ్లన్నింటినీ వినియోగంలోకి వచ్చేలా చర్యలు చేపడతాం.

– మహబుబ్‌ఖాన్, ఎంపీడీ

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి



జ్వర పీడితులతో మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి కేసి కుళ్లాయప్ప

ధర్మవరం రూరల్: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ కేసి కుళ్లాయప్ప నాయక్, అసిస్టెంట్ మలేరియా అధికారి ఆర్. లక్ష్మినాయక్ సూచించారు. గురువారం ఓబుళనాయనపల్లి తండాలో దర్శనమల పీహెచ్‌సీ డాక్టర్ పుష్పలత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెడికల్ క్యాంప్‌ను వారు పరిశీలించారు. అనంతరం సీజనల్ వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటింటికి తిరిగి లార్వా బ్రీడింగ్ పాయింట్స్ గుర్తించి వాటిని తొలగింపజేశారు. అదే విధంగా గ్రామంలో గల జ్వరం కేసులను గుర్తించి వారికి రక్త పూతలు తీసి వాటిని పీహెచ్‌సీ ల్యాబ్‌కు పంపుతామన్నారు. ధర్మవరం సబ్ యూనిట్ ఆఫీసర్ జయరాం నాయక్, డాక్టర్ పుష్పలత, సూపర్‌వైజర్ రాజశేఖర్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, ఎఎన్ఎం శివలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌సీ భారతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి



కరపత్రాలు విడుదల చేస్తున్న యువర్స్ ఫౌండేషన్ సభ్యులు

ధర్మవరం అర్బన్: న్యూరాలజీ, కార్డియాలజీ ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ పోలా ప్రభాకర్, యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు నాగేంద్ర తెలిపారు. పట్టణంలో గురువారం ఉచిత వైద్య శిబిరం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 4న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పట్టణంలోని వాసవి బాలికల జూనియర్ కళాశాల ఎదురుగా వైద్య శిబిరం నిర్వహిస్తామని, నరాల వ్యాధి నిపుణులు డాక్టర్ రవిప్రకాష్, గుండె వైద్య నిపుణులు సుభాష్ చంద్రబోస్ రోగులకు సేవలందిస్తారన్నారు. అలాగే ఉచిత కంటి వైద్య శిబిరాన్ని 4న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నామని తెలిపారు. యువర్స్ ఫౌండేషన్ సభ్యులు శీలా నాగేంద్ర, జయరాం, సుకుమార్, బండి నాగేంద్ర, చాంద్‌బాషా, డాక్టర్ సుబ్బారావు, సత్యనిర్ధారణ్, రమేష్‌బాబు, శ్రీనివాసులు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వాహనం బోల్తా



బోల్తా పడిన బొలెరో

అగళి: రామనపల్లి సమీపంలో గురువారం తెల్లవారుజామున ఓ వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. వివరాలు..బొలెరో వాహనం రొళ్ల మండలం టీడీ హళ్లి నుంచి కీర(దోసకాయలు) లోడ్‌తో శిరాకు బయలుదేరింది. రామనపల్లి సమీపంలో అదుపుతప్పి రోడ్డుపై బోల్తాపడింది. ఘటనలో వాహనంలో ఉన్న కాయలు రోడ్డుపై పడిపోయాయి. డ్రైవర్, అతడితోపాటు ఉన్న మరోవ్యక్తి స్వల్పగాయాలతో బయటపడ్డారు.

'శ్రావణ శనీశ్వరుడి'ని కొలుతము రారండి!



అలంకరణలో శనీశ్వర స్వామి

పావగడ: కర్ణాటక, తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధి చెందిన స్థానిక శనీశ్వరాలయంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని శ్రావణ శనివారోత్సవాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా ఈ నెల 5 నుంచి వచ్చే నెల 2 వరకు శ్రావణ మాస పూజలు ఆలయంలో వైభవంగా జరుగుతాయి. ఈ నెల 10 న తొలి శ్రావణ శనివారోత్సవం, 16 న ద్వితీయ శ్రావణ శుక్రవారం సందర్భంగా వరమహాలక్ష్మి పూజలు, 17 న ద్వితీయ శ్రావణ శనివారోత్సవం, 24 న తృతీయ శ్రావణ శనివారోత్సవం, 31 న చతుర్ధ శని వారోత్సవం, జ్యేష్ఠాదేవి సమేత శనీశ్వర స్వామి వెండి పల్లకీ ఉత్సవం, శని త్రయోదశి పూజలు వైభవంగా జరగనున్నాయి. శ్రావణ మాసంలో శ్రావణ శనీశ్వరుడిని కొలిస్తే సకల పాపాలు తొలగి పోతాయని, ఏల్నాటి శని మటు మాయమై పోతుందని భక్తుల నమ్మకం. దీంతో శ్రావణ శనీశ్వర స్వామిని దర్శించుకుని పూజలు సమర్పించి పాపాలు పోగొట్టు కోడానికి తండోప తండాలుగా భక్తులు ఆలయానికి తరలివస్తారు. కాకి వాహనుడి కి ఇష్టమైన నల్ల నువ్వుల తైలం, నల్ల వస్త్రాలు సమర్పించి అభిషేక పూజలు చేస్తారు. నవగ్రహ పూజలు నిర్వహిస్తారు. అలాగే తలనీలాలు సమర్పించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. ఆలయం ఎదుట ఉన్న అగ్ని గుండంలోకి నల్ల నువ్వుల తైలం, నల్ల వస్త్రాలు, నవధాన్యాలు సమర్పించి 9 సార్లు అగ్ని గుండం చుట్టూ ప్రదిక్షణలు చేస్తారు. ఆలయంలో శనీశ్వరస్వామి కంటే ముందుగా కొలువుదీరిన శీతలాంభదేవికి కుంకుమార్చన పూజలు నిర్వహిస్తారు. ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచే కాకుండా తమిళనాడు, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి కూడా భక్తులు తరలి వచ్చి స్వామి వారికి విశేష పూజలు నిర్వహిస్తారు. శ్రావణ మాస వేడుకలకు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

సజావుగా పింఛన్ల పంపిణీ



పింఛన్ సొమ్ము అందిస్తున్న ఎమ్మెల్యే వెంకటప్రసాద్

కదిరి టౌన్: మున్సిపాలిటి పరిధిలోని 13,14,15, వార్డులోని పింఛన్‌దారులకు కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ గురువారం పింఛన్ సొమ్ము అందజేశారు. ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ సొమ్ము రూ.4 వేల రూపాయలు ఇస్తున్నామన్నారు. ఆయా వార్డులో వార్డు సచివాలయ సిబ్బంది పింఛన్ సొమ్ము పంపిణీ చేశారు.

అమడగూరు: మండల వ్యాప్తంగా మొదటిరోజే గురువారం 98 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయినట్లు ఎంపీడీఓ అశోక్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. కందుకూరిపల్లిలో ఎమ్మెల్యే సింధూరారెడ్డి చేతుల మీదుగా పింఛన్లను పంపిణీ చేశారు. మండలంలో 140 మంది అందుబాటులో లేరని, వారికి శుక్రవారం పంపిణీ చేస్తామని అధికారులు పేర్కొన్నారు.

బత్తలపల్లి: మండలంలో 6,357 మంది పింఛన్‌దారులు ఉండగా గురువారం 6,169 మంది(97 శాతం)కి పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. మండలంలోని కొన్ని గ్రామాల్లో టీడీపీ నాయకుల ఇంటి వద్ద పింఛన్లు పంపిణీ చేశారు. వెంకటగారిపల్లిలో తమపైనే కోర్టుకు వెళ్లతారా అంటూ పది మంది పింఛన్లు నిలిపివేయాలని టీడీపీ నాయకులు అధికారులకు జాబితా ఇచ్చినట్లు తెలిపారు. అయితే ఎంపీడీఓ శివనాగప్రసాద్ పోలీసుల సహకారంతో పింఛన్లు పంపిణీ చేశారు.

నల్లచెరువు: మండల వ్యాప్తంగా గురువారం పింఛన్లు పంపిణీ ప్రశాంతంగా జరిగింది. మొత్తం 4975 మందికిగానూ 4756 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ రాణెమ్మ తెలిపారు.

కదిరి అర్బన్: మండలవ్యాప్తంగా గురువారం సామాజిక భద్రతా పింఛన్లు పంపిణీ చేశారు. మొత్తం 5498 మందికిగాను 5331 పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ అంజనప్ప తెలిపారు.

చెన్నేకొత్తపల్లి: మండల వ్యాప్తంగా గురువారం సామాజిక భద్రత పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ మోహన్ కుమార్ తెలిపారు. అన్ని గ్రామాల్లో లబ్ధిదారులకు సచివాలయాల సిబ్బంది, వీఆర్‌ఓలు పింఛన్ సొమ్ము అందజేశారన్నారు. మండల వ్యాప్తంగా ఎక్కడా ఎలాంటి సమస్యలు తలెత్తలేదని వెల్లడించారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేష్టం



బత్తలపల్లిలో మాట్లాడుతున్న ఆర్డీటీ వైద్యుడు సునీల్



పుట్టపర్తిలో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

బత్తలపల్లి: నవజాత శిశువులకు తల్లి పాలు శ్రేష్టమని బత్తలపల్లి ఆర్డీటీ వైద్యులు డాక్టర్ రేణుక, డాక్టర్ సునీల్, నర్సింగ్ కళాశాల సూపరింటెండెంట్ లక్ష్మీ పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని గురువారం స్థానిక ఆర్డీటీ ఆస్పత్రి నుంచి బత్తలపల్లి కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. నాలుగు రోడ్ల కూడలిలో మానవహారంగా నిల్చుకుని తల్లి పాల ప్రత్యేకత, ప్రయోజనాలు గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఆర్డీటీ ఆస్పత్రి ఇన్‌చార్జ్ వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది, నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

తాడిమర్రి: తల్లిపాలే బిడ్డలకు మొదటి వ్యాధి నిరోధక టీకా అని వైద్యాధికారి హరిత పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక ఎస్సీ కాలనీలోని మొదటి అంగన్‌వాడీ కేంద్రం వద్ద గురువారం ఆమె వైద్య సిబ్బంది, అంగన్ వాడీ సిబ్బందితో కలసి బాలింతలు, గర్భిణులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలింతలు పిల్లలకు జన్మనిచ్చిన గంటలోపు తల్లిపాలను తాపాచ్చు అన్నారు. హెల్త్ సూపర్ వైజర్ రామ్‌కుమార్, ఆరోగ్య కార్యకర్తలు జానకీరామ్, రంగనాయకులు, ఏఎన్ఎం కోమలి, అంగన్‌వాడీ కార్యకర్త అలివేలమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్: తల్లిపాలు ఎంతో విశిష్టమైనవని డాక్టర్ మునిచంద్రిక పేర్కొన్నారు. గురువారం కొట్లపల్లి, నిడిమామిడి గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు .ఈ సందర్భంగా తల్లి పాల వారోత్సవాల పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ నగేష్, సూపర్‌వైజర్ వెంకటరమణ, సిబ్బంది శివ, మంజులవాణి, సుస్మిత, విజయభాస్కర్, 104 సిబ్బంది లక్ష్మీపతి, మోహన్ తదితరులు ఉన్నారు.

తలుపుల : పులిగుండ్లపల్లి అంగన్‌వాడీ సెంటర్‌లో గురువారం వైద్యాధికారి అఫ్తాప్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారి గర్భిణులు, బాలింతలకు తల్లి పాల ప్రాముఖ్యత తెలియజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామమోహన్, ఆరోగ్య కార్యకర్తలు ప్రభాకర్, ఏఎస్ఎం సుజాత, ఎంఎల్ హెచ్‌పీ భార్గవి, అంగన్‌వాడీ కార్యకర్త కిష్టమ్మ పాల్గొన్నారు.

వాల్మీకి ఉద్యమ నేత అరెస్ట్ అన్యాయం



మాట్లాడుతున్న వీఆర్‌పీఎస్ నాయకులు

ధర్మవరం: వాల్మీకి ఉద్యమనేత, వీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బోయ పులికొండన్నను పోలీసులు అదుపులోకి తీసుకోవడం అన్యాయమని వీఆర్‌పీఎస్ రాష్ట్ర యూత్ అధ్యక్షుడు చిన్నూరు నరసింహులు, నాలుగు జిల్లాల ఇన్‌చార్జ్ బోయ సాంబశివ, చిన్నకొండయ్యపల్లి శ్రీనివాసులు, పుట్టపర్తి గంగరాజు పేర్కొన్నారు. పట్టణంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. జూలై 7న గ్యాంగ్ రేప్‌కు గురై ఇంతవరకు ఆచూకీలేని 9 సంవత్సరాల బాలిక వాసంతి ఆచూకీ మృతదేహాన్ని ఆమె కుటుంబానికి అప్పగించాలని అడగడం నేరమా అని ప్రశ్నించారు. సీఎంను శ్రీశైలంలో అడ్డుకుంటామని చెప్పకపోయినా పోలీసులు ఎందుకు అరెస్టు చేశారో తెలియడం లేదన్నారు. కొండన్నను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

సుప్రీంకోర్టు తీర్పుపై సంబరాలు



ఓడీచెరువులో అంబేడ్కర్ విగ్రహం వద్ద సంబరాలు చేసుకుంటున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



కదిరిలో సంబరాలు జరుపుకుంటున్న నాయకులు



ధర్మవరంలో ర్యాలీ నిర్వహిస్తూ సంబరాలు చేసుకుంటున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

ఓడీచెరువు: ఎస్సీ వర్గీకరణను సమర్థిస్తూ గురువారం సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంతో ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఓడీచెరువు సర్పంచు గోవిందు, నాయకులు లక్ష్మన్న, బావన్న, కత్తి ఆనంద్ మాట్లాడుతూ అనేక ఉద్యమాల ఫలితంగా ఏడుగురు న్యాయ మూర్తుల ధర్మాసనం తీర్పు వెలువరించడం చారిత్రక విజయమన్నారు. సీనియర్ నాయకులు ఎర్రదొడ్డప్ప, శ్రీనివాసులు, కదిరప్ప, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్: ఎస్సీ వర్గీకరణను సమర్థిస్తూ గురువారం సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంతో పట్టణంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మిఠాయిలు పంచుకొని సంబరాలు నిర్వహించారు. మంద కృష్ణ మాదిగ పోరాట ఫలితమే నేడు సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ తీర్పు అని ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగేంద్రనాథ్ తెలిపారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పలక అంజనేయులు, ఎంఈఎఫ్ కదిరి డివిజన్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు: ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా సుప్రీంకోర్టు వెలవరించిన తీర్పు చరిత్రాత్మకమని ఎమ్మార్పీఎస్, దళిత సంఘం నాయకులు అన్నారు. బొంతలపల్లిలో గురువారం అంబేడ్కర్ విగ్రహం వద్ద ఘనంగా నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యుడు జక్కల ఆదిశేషు, ఎమ్మార్పీఎస్ నాయకులు ఎంబీ నరసింహులు, పీవీ రామచంద్ర, శివన్న, శ్రీనివాసులు, ఏవీ నరసింహులు, సీ. శ్రీనివాసులు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం అర్బన్: సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణపై తీర్పు ఇవ్వడం పట్ల ఎమ్మార్పీఎస్ నాయకులు గురువారం సంబరాలు చేసుకున్నారు. పట్టణంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎమ్మార్పీఎస్ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు బూదెప్ప, జిల్లా అధికార ప్రతినిధి నాగభూషణం, గజ్జల రామంజినేయులు, తాడిమర్రి రామంజినేయులు, చిల్లవారిపల్లి శివయ్య, ధర్మవరం మండలాధ్యక్షుడు నాగరాజు, సుధాకర్, రామకృష్ణ, నాగేపల్లి బాబు, రామ్మూర్తి, ప్రకాష్, రమేష్, నారాయణ, భావన్న, పాండు, కదిరప్ప, ఆదినారాయణ, అంజనప్ప, యాదగిరి, పూజారి పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

నల్లమాడ: ఎస్సీ వర్గీకరణకు సంబంధించి సుప్రీం కోర్టు సానుకూల నిర్ణయం ప్రకటించడంపై గురువారం నల్లమాడలో ఎస్సీ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ మండల నాయకులు ఆసాది ఆదినారాయణ, రిటైర్డ్ టీచర్ నరసింహులు, గంగప్ప తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు చరిత్రాత్మకమని ఎమ్మార్పీఎస్ నాయకులు తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. నాయకులు బండ్లపల్లి నరసింహులు, కేశాపురం వెంకట్రాముడు, కొత్తచెరువు మల్లెల నాగరాజు, సాయి ప్రసాద్, కొత్తచెరువు రాధనాగరాజు, తలమర్ల అంజి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణతో దళితుల్లో హర్షాతిరేకాలు

చెన్నేకొత్తపల్లి: ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో గురువారం మండల వ్యాప్తంగా ఉన్న ఎస్సీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సంబరాలు చేసుకున్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు, అందరివాడు ఉత్సవ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

8న స్కూల్ యాజమాన్య కమిటీ ఎన్నికలు



నోటిఫికేషన్‌ను విడుదల చేస్తున్న గోపాల్‌నాయక్

ఎన్‌పీకుంట/ బత్తలపల్లి/ ధర్మవరం అర్బన్: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 8న పాఠశాలల యాజమాన్య కమిటీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్‌పీకుంట, బత్తలపల్లి, ధర్మవరం ఎంఈఓలు గోపాల్‌నాయక్, చాముండేశ్వరి, సుధాకర్‌నాయక్, రాజేశ్వరి, గోపాల్‌నాయక్ తెలిపారు. గురువారం వారు ఎన్నికల విధివిధానాలను వివరించారు. ఆయా పాఠశాలలల్లో గురువారం మధ్యాహ్నం ఓటరు జాబితా ప్రదర్శన, 5న ఓటరు జాబితాపై అభ్యంతరాల స్వీకరణ, ఓటరు జాబితా ప్రదర్శన, అదే ఎన్నికలు నిర్వహణ, కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నిక, ప్రమాణస్వీకారం ఉంటుందన్నారు. అనంతరం కమిటీ మొదటి సమావేశం నిర్వహిస్తారని వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

మడకశిరరూరల్: మండలంలోని సిద్దప్ప ఇళ్ల వద్ద గురువారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. శంకరప్ప, అనితమ్మ ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి రోడ్డు పైకి వస్తుండగా మడకశిర వైపునకు వెళుతున్న ద్విచక్ర వాహనదారుడు వారిని ఢీ కొట్టాడు.